క్యాలెండర్ ఆవిష్కరణ

చెన్నూర్, జనవరి 22: పట్టణంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను లెక్చరర్లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి ప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దండనాయకులు, సందీప్‌కుమార్, మీడియా కార్యదర్శి ఎస్ లక్ష్మణ్, మహిళా కార్యదర్శులు టీ శైలజ, జీ అరుణావతి, కార్యదర్శి కందుల రాజయ్య, లైబ్రేరియన్ ఎండీ యూసఫ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల ఏసీసీ, జనవరి 22: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల నియామకం కోసం అర్హులైన ఎంబీబీఎస్, బీఎఎంఎస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.జీ సుబ్బారాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 కంటే ముందు ఉత్తీర్ణులైన బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అభ్యర్థులు అరునెలల కమ్యూనిటీ హెల్త్ బ్రిడ్జి కోర్సు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం mancherial.telangana.gov.in వెబ్‌సైట్లో తెలుసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత జిరాక్స్ సర్టిఫికెట్లను జత చేసి ఈ నెల 23న ఉదయం 10. 30 గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఐడీవోసీ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో స్వయంగా వచ్చి అందజేయాలని కోరారు.

వాహనదారులకు అవగాహన

మంచిర్యాల ఏసీసీ, జనవరి 22: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ టెస్ట్, ఇతర పనుల కోసం మంచిర్యాల ఆర్‌టీవో కార్యాయానికి వచ్చిన వారికి రోడ్డు భద్రతా నియమాలపై జిల్లా రవాణ శాఖ అధికారి లెక్కల కిష్టయ్య, ఎంవీఐ రాహుల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భగా ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు అవగాహన సదస్సులను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని కోరారు. అనంతరం పలు సూచనలు చేసి, వాహనాలకు స్టిక్కర్లను అంటించారు. కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వివరాల సేకరణ

హాజీపూర్, జనవరి 22 : మండలంలో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ హై అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీటీసీలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రూ. 23 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలను సేకరించి పై అధికారులకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత, ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

తాండూర్/కాసిపేట, జనవరి 22 : ఓటరు దినోత్సవం సందర్భంగా తంగళ్లపల్లి జడ్పీహెచ్ఎస్, కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తాండూర్‌లో ఎంఈవో వాసాల ప్రభాకర్, కాసిపేట లో కాంప్లెక్స్ హెచ్ఎం సాంబమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏం విశ్వతేజ, ఎం కావ్య, రమ్య, పూర్ణేశ్వరి విజేతలుగా నిలిచారు. వీరు మంచిర్యాలలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఉపాధ్యాయులు ఐ విద్యాసాగర్, జీ ప్రకాశ్, ఎం నరేందర్ , నోడల్ అధికారి మల్లేశం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్: నృత్యాలు చేస్తున్న యువకులు



సీసీసీ నస్పూర్: విలేజ్‌నస్పూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మందమర్రిలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న పూజారులు

ఊరూరా రామనామ స్మరణ

- కిటకిటలాడిన ఆలయాలు
- పూజలు, అన్నదానాలు

అయోధ్యంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మంచిర్యాల పట్టణంతో పాటు హాజీపూర్, దండేపల్లి, జన్నారం, చెన్నూర్, కోటపల్లి, భీమారం, కాసిపేట, నెన్నెల, కన్నెపల్లి, మందమర్రి, జైపూర్ మండలాల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చారు. ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామాలన్నీ రామ నామ స్మరణతో మార్మోగాయి. పలు చోట్ల హనుమాన్ చాలీసా పఠించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అయోధ్యలో బాల రామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. సాయంత్రం భజనలు నిర్వహించారు. దండేపల్లిలో ముస్లిం యువకుడు మహ్మద్ సలీం కాషాయ జెండా పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నాడు. పాల్గొని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మంచిర్యాల జడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించిన యజ్ఞంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు దంపతులు, భీమారంలో ఎమ్మెల్యే వివేక్, కోటపల్లిలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సింగరేణి ప్రాంతమైన శ్రీరాంపూర్, సీసీసీ నస్పూర్‌లోని ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. సింగరేణి అధికారులు, ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

-నెట్‌వర్క్

మంచిర్యాల ఏసీసీ: మంచిర్యాలలో వేషధారణలో కళాకారులు

దండేపల్లి: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జన్నారంలో..

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : జూనియర్ బాలికల జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన క్రీడాపాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ జట్టు నుంచి ప్రతిభ చూపిన టీ సత్యభామ(కెరమెరి), బీ అంజలి(తిర్యాణి), ఎస్ అనిత (జైనూర్)లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని సరేస్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ క్రీడాకారులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ సాంబశివరావు, ఆసిఫాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగెల మల్లికార్జున్, విష్ణుకాంత్ ఆచార్య, రాకేశ్ అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

గణతంత్ర దినోత్సవాలకు కెరమెరి విద్యార్థి

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న పరేడ్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి క్రీడాకారిణి తుమ్రామ్ సత్యభామకు ఆహ్వానం అందినట్లు ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నాయకులు సోమ వారం తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు మాట్లాడుతూ సత్యభామకు రిపబ్లిక్ డే కార్యక్రమానికి ఆహ్వానం రావడం గర్వకారణమన్నారు.కోచ్ సునార్కర్ అరవింద్‌ను ఈ సందర్భంగా అభినందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిలేదీక్షల విరమణ

సీసీసీ నస్పూర్, జనవరి 22: సమస్యల పరిష్కారానికి రిలే దీక్షలు చేస్తున్న నస్పూర్ మున్సిపాలిటీలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు హామీ తో విరమించారు. నస్పూర్‌గేట్ వద్ద దీక్షలు చేస్తున్న వారికి సోమవారం సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షలను ఎమ్మెల్యే విరమింపజేశారు. తమ డిమాండ్లను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, కౌన్సిలర్లు సీపతి సుమతీ మల్లేశ్, గెల్లు రజితామల్లేశ్, తోట శ్రీనివాస్, బొద్దున సంధ్యారాణి రాంమూర్తి, బండి పద్మ, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కొయ్యల వెంకటి, ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్వర్, ఉపాధ్యక్షులు మద్దెర్ల సతీశ్, మాడుగుల రాజం, నాయకులు రాచకొండ వెంకటేశ్వర్‌రావు, ఇరికిళ్ల పురుషోత్తం, రాచకొండ గోపాల్‌రావు, ఖాలీద్, భీం రవి, దోనిపెల్లి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా చూడాలని వినతి

మంచిర్యాల అర్బన్, జనవరి 22: అంగన్ వాడీ ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు జరుగకుండా చూడాలని కోరుతూ సోమ వారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ వినతి పత్రం అందజేశారు. అధికారులు అనుకూలంగా ఉన్న వారినే బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలా జరుగకుండా చూడాలని కోరారు.

ట్యాంకర్ ఢీకొట్టడంతో కారు బోల్తా

కాసిపేట, జనవరి 22 : గూడెం రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో కారు బోల్తా పడింది. అందులో ఉన్న మహిళలకు తీవ్రగాయాలయాయి. ఆసిఫాబాద్‌కు చెందిన మైస రమ్యకృష్ణ, భర్త రమేశ్, పగిడి మాధవి, మరో ఏడేళ్ల చిన్నారి కారులో ఆసిఫాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమగూడెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారం తెలిపారు.

విజేతగా కోటపల్లి-ఏ జట్టు

ట్రోఫీ అందజేస్తున్న మూల రాజిరెడ్డి

కోటపల్లి, జనవరి 22 : కోటపల్లి మండలకేంద్రంలో ఆలూరి సత్తయ్య స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా కోటపల్లి-ఏ జట్టు నిలిచింది. వారం రోజుల పాటు సాగిన మ్యాచ్‌లో ఫైనల్‌కు కోటపల్లి-ఏ, కోటపల్లి-బీ జట్లు చేరుకున్నాయి. విజేతలకు జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. యువకులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, గెలుపోటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 8 వేలు గెలుపొందిన జట్లకు అందజేశారు. నిర్వాహకులు ఆలూరి సంపత్, సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్, మహేశ్ ప్రసాద్, పోగుల సతీశ్, నీల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

దండేపల్లి, జనవరి22: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు 11:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో హాజరవ్వాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రజావాణి

వేమనపల్లి, జనవరి 22: వేమనపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజావాణిలో దరఖాస్తులు రాలేదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోవింద్‌నాయక్, ఏపీవో సత్యప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జనవరి 22: ప్రజావాణి కార్యక్రమంలో నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బిట్ల సుధాకర్ తె లిపారు. భూ సంబంధిత సమస్యలపై రెండు, రేషన్ కార్డు, వ్యవసాయానికి సంబంధించి ఒక్కోటి వచ్చినట్లు వెల్లడించారు.

రేపు మినీ జాబ్ మేళా

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం(24న) మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలోని వినయ్ ఆటోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 10 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్ హెల్పర్ ఆరు, అకౌంటెంట్ ఒకటి, కమర్షియల్ వెహికిల్ డ్రైవర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉందన్నారు. 18 నుంచి 25 ఏండ్ల వయస్సు కలిగి, డిగ్రీ/ఐటీఐ/డిప్లొమా పూర్తి చేసిన అర్హులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, జనవరి 22: జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో ఉన్న మోడల్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజనీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 100 సీట్లు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతుల్లో ఖాళీ సీట్లకు ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ కొత్త కమిటీ

తాండూర్, జనవరి 22 : తాండూర్ టీఎస్ యూటీఎఫ్ కొత్త కమిటీని సోమవారం జిల్లా ఉపాధ్యక్షుడు జీ చక్రపాణి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీ దేవదాస్, ఉపాధ్యక్షుడిగా గోపి, ఉపాధ్యక్షురాలిగా కళావతి, ప్రధాన కార్యదర్శిగా అత్తె సుధాకర్, కోశాధికారిగా గడ్డం సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీని జీ చక్రపాణి అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు వినతి

కాసిపేట, జనవరి 22 : సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కను కాసిపేట మండలం లోని సోమగూడెం(కే) సర్పంచ్, మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు సపాట్ శంకర్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వారిని జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సంతోషితో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. సర్పంచ్‌ల ఎన్నికలు జరిగే వరకు ఇన్‌చార్జిలుగా తమనే కొనసాగించాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని శంకర్ తెలిపారు.

గ్రామ సభ

కాసిపేట, జనవరి 22 : మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్ అధ్యక్షతన గ్రామ అభివృద్ధి ప్రణాళిక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్ మాట్లాడుతూ సింగరేణి కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో పేలుళ్ల తీవ్రత పెరిగి ఇండ్లు దెబ్బతిని కూలిపోయే స్థితికి చేరుతున్నాయని, యాజమాన్యం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని, సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. గ్రామ సభలో కార్యదర్శి కొండగొర్ల కీర్తి, వార్డు సభ్యులు సపాట్ మల్లేశ్, మల్యాల స్రవంతి, బూడిద రోజా, తదితర శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టెండాల్ ఎంపిక పరీక్షలు

శ్రీరాంపూర్, జనవరి 22: ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో అంతర్గత టెండాల్, టెండాల్ సూపర్‌వైజర్, బిట్ షార్ప్‌నర్, కార్పెంటర్ల భరీకి సోమవారం వర్క్‌షాప్‌లో కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్‌వోటూజీఎం రఘుకుమార్, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అభ్యర్థులకు మౌఖిక ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్గత ఖాళీల భర్తీకి, అత్యంత పారదర్శకంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ఉద్యోగోన్నతి కల్పిస్తామని తెలిపారు. ఏజెంట్ గోపాల్‌సింగ్, వర్క్‌షాప్ ఇన్‌చార్జి మల్లయ్య, డీవైపీఎం రాజేశ్వర్‌రావు , తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి, జనవరి 22: సుభాష్ చంద్రబోస్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ సదయ్య సూచించారు. అంబులెన్స్‌ను సోమవారం ఆయన కౌన్సిలర్ బండిప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. సేవా సమితి సేవలు అభినందనీయమని కొనియాడారు. తమ వ్యాపారులు చేసుకుంటూనే సేవా సమితి నిర్వహిస్తూ ప్రజా సేవ కోసం అంబులెన్స్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు ఉమామహేశ్వర్‌రెడ్డి, కొండయ్య, సీనియర్ అడ్వకేట్ గోపీ కిషన్ సింగ్, నాయకులు సలీం, గట్టయ్య, నరేశ్, ఆసం అఖిల్, శ్రీనాథ్, సురేశ్, రవి, షకీల్, ముజీబ్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

బట్ట సంచులనే వాడాలి

కోటపల్లి, జనవరి 22 : పర్యావరణ మిత్ర బట్ట సంచులనే వాడాలని జిల్లా విద్యాశాఖ గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్, పాఠశాల హెచ్ఎం గుండేటి యోగేశ్వర్ పిలుపునిచ్చారు. కోటపల్లి మండలంలోని పారుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాష్ట్ర నేషనల్ కోర్ "లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్" అనే సందేశంతో రూపొందించిన బట్ట సంచులను పర్యావరణ క్లబ్ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలో ఎంపిక చేసిన అన్ని గ్రీన్ కోర్ పర్యావరణ క్లబ్‌లు గల ఉన్నత పాఠశాలలకు బట్ట సంచులను పంపిణీ చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. గ్రీన్ టీచర్ సతీశ్ కుమార్, ఉపాధ్యాయులు పొగాకు వెంకటేశ్వర్, టీ పావని, బీ నర్సింగ్, బిక్కు, టీ వాణిశ్రీ, విలాస్ జాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బట్ట సంచులను ఆవిష్కరిస్తున్న గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్, పాఠశాల హెచ్ఎం గుండేటి యోగేశ్వర్

ప్రాణహిత స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలు

సీసీసీ నస్పూర్, జనవరి 22: నాగార్జునకాలనీలోని ప్రాణహిత స్టేడియంలో ఈనెల 26న రిపబ్లిక్ వేడుకలను నిర్వహించబోతున్నట్లు జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం అధికారులతో కలిసి స్టేడియాన్ని జీఎం సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు చేశారు. ఎస్‌వోటూజీఎం రఘుకుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సివిల్ డీజీఎం ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ పీవో కాంతారావు, తదితరులున్నారు.

అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సీఎంవోఏఐ అధ్యక్ష అభ్యర్థి ఏవీ రెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 22: సింగరేణి బొగ్గు గని అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఎంవోఏఐ అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే 5గనిపై మైసమ్మ దేవాలయంలో సోమవారం ఆయన పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. ఈ నెల 28న సింగరేణిలో మొట్టమొదటి సారిగా రహస్య బ్యాలెట్ పద్ధతి(ఆన్‌లైన్) ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నో రోజులుగా సీఎంవోఏఐ సింగరేణి విభాగానికి ఎన్నికలు జరగకుండా ఉన్నాయని పేర్కొన్నారు. సింగరేణిలో సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతూ అధికారుల సమస్యల పరిష్కారానికి కోలిండియా స్థాయిలో కృషి చేసినట్లు పేర్కొన్నారు. సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నానని, తనకు ఓటు వేసి అధ్యక్షుడిగా గెలిపించాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా 2300 మంది అధికారులు ఉన్నారని చెప్పారు. సింగరేణి, కోలిండియా యాజమాన్యాలతో కో ఆర్డినేషన్ చేసుకుంటూ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీవో రణదీప్ గౌడ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి నర్సింగారావు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఏవీ రెడ్డి

కొత్త లోడర్ ప్రారంభం

శ్రీరాంపూర్, జనవరి 22: శ్రీరాంపూర్ ఓసీపీలో యాజమాన్యం కొనుగోలు చేసిన లోడర్‌ను సోమవారం జీఎం సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 530 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన లోడర్‌ను 5.3 కోట్లతో కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. లోడర్‌తో ఉత్పత్తి, ఉత్పాదక సాధనకు సాధ్యమవుతుందన్నారు. ఓసీపీలో పూర్తి యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పీవో పురుషోత్తంరెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, పిట్ కార్యదర్శి ఎన్ సత్తయ్య, ఈఈ చంద్రశేఖర్, శ్యాంసుందర్‌రావు, సీనియర్ పీవో బీ శంకర్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీపై నూతన లోడర్‌ను ప్రారంభిస్తున్న జీఎం

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
బెల్లంపల్లి: 91827 77671, 91827 77677